స్వల్పకాలిక శిక్షణకు దరఖాస్తులు

ప్రజాశక్తి - సీతంపేట

ప్రధానమంత్రి కౌసల్య వికాస్ యోజన వారి సారథ్యంలో స్కిల్ హబ్ ఇనిషియేటివ్ ప్రోగ్రాం ద్వారా స్థానిక ఐటిఐలో ఉచిత స్వల్పకాలిక శిక్షణా కోర్సుల్లో శిక్షణ కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ప్రిన్సిపల్ ఎం.గోపాలకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ప్లబింగ్‌లో శిక్షణకు అభ్యర్థుల కనీస విద్యా అర్హత పదో తరగతి అన్నారు. ఈనెల 19లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు..ఆసక్తి గల అభ్యర్థులు వారి యొక్క బయోడేటా తో పాటుగా విద్యా అర్హత ధవపత్రాలు , రెండు పాస్పోర్ట్ సైజ్ ఫొటోస్, ఆధార్ కార్డ్, బ్యాంక్ అకౌంట్ వివరాలతో పాటు స్థానిక ఐటిఐకి హాజరై దరఖాస్తు చేసుకోవాల్సిందిగా కోరారు. పైన పేర్కొనబడిన స్వల్పకాలిక శిక్షణా కోర్సుల్లో శిక్షణ పూర్తయిన వెంటనే ఉపాధి కల్పిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 7993795796 ఫోన్ నెంబరు సంప్రదించాలని సూచించారు.

వైద్యులకు రక్షణ కల్పించాలి

నేడు వైద్య సేవలు బంద్

కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న ప్రభుత్వాసుపత్రి వైద్యులు, సిబ్బంది

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

దేశంలో ప్రాణాలు కాపాడే వైద్యుల ప్రాణాలకే రక్షణ లేకుండా పోయిందని, మహిళలకు, వైద్యులకు రక్షణ కల్పించాలని పార్వతీపురం చెందిన పలు వైద్య సంఘాలకు చెందిన డాక్టర్లు డిమాండ్ చేశారు. ఇటీవల కలకత్తాలోని ఆర్జీకార్ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న జూనియర్ డాక్టర్‌పై పాశవికంగా ప్రవర్తించి, అఘాయిత్యానికి పాల్పడి హత్య చేసిన సంఘటన మరువకముందే, అదే ఆసుపత్రిలో ఈనెల 14న గుర్తు తెలియని 40 మంది దుండగులు చొరబడి విధ్వంసానికి పాల్పడిన సంఘటనపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ జిల్లాకు చెందిన ఎపిపిహెచ్ సిడిఎ, ఐఎంఎ, ఎపి జిడిఎ, ఎపి ఎన్జీవో సంఘాలకు చెందిన వైద్యులు, ఉద్యోగులు శుక్రవారం స్థానిక జిల్లా కేంద్ర ఆసుపత్రి నుండి కలెక్టరేట్ వరకు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా పెద్ద ఎత్తున నిరసన, ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్‌కు వినతిని అందజేశారు. ఈ సందర్భంగా వైద్య సంఘాల నాయకులు మాట్లాడుతూ ఎంతగా అభివృద్ధి చెందినప్పటికీ వైద్యులు, మహిళలు స్వేచ్ఛగా విధులు నిర్వహించలేని దుస్థితిలో దేశం ఉండడం విచారకరమన్నారు. ప్రభుత్వాలు స్పందించి మహిళలపై జరుగుతున్న నేరాలను అరికట్టాలని, అలాగే కలకత్తాలో అభం శుభం ఎరుగని వైద్య విద్యార్థిపై పాశవికంగా ప్రవర్తించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఈ దాడులకు నిరసగా శనివారం ఉదయం 6గంటల నుంచి ఆదివారం ఉదయం 6గంట వరకు 24గంటల పాటు ప్రభుత్వ, ప్రయివేట్ వైద్యసేవలు నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. అత్యవసర వైద్యసేవలు మినహాయింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కేంద్ర ఆసుపత్రి సూపరింటెండెంట్ వాగ్దేవి, వైద్యులు కామేశ్వరి, మంతిని వినోద్, జి.రవికుమార్, జి.వాసుదేవరావు, భోగి ఈశ్వరరావు, యాళ్ల వివేక్, ఎన్జీవో సంఘ నాయకులు జివి కిషోర్, ప్రైవేటు, ప్రభుత్వ రంగాలకు చెందిన పలువురు వైద్యులు పాల్గొన్నారు.

మహేష్ (ఫైల్) ఉపాధ్యాయులు గల్లంతైన వాగు ఇదే... ఆర్తి (ఫైల్)

ఇద్దరు ఉపాధ్యాయులను

మింగేసిన గెడ్డవాగు

ఒకరి మృతదేహం లభ్యం.. మరొకరి కోసం గాలింపు

ప్రజాశక్తి-పాచిపెంట

అకస్మాతుగా కురిసిన వర్షానికి పొంగి ప్రవహించిన గెడ్డవాగు ఇద్దరు ఉపాధ్యాయులను బలితీసుకుంది. విధులు ముగించుకొని ఇంటికి వెళ్తున్న ఇద్దరు ఏక లవ్య పాఠశాల ఉపాధ్యాయులు గెడ్డ ఉధృతికి కొట్టుకుపోయారు. వారిలో ఒకరి మృతదేహం లభ్యం కాగా, మరొకరి కోసం పోలీసులు గాలిస్తున్నారు. పాచిపెంట మండలం సరాయివలస రాయిమానుగెడ్డ వద్ద ఈ దుర్ఘటన చోటు చేసుకుంది.

పాచిపెంట మండలం సరాయివలస సమీపంలోని కొటికిపెంట ఏక లవ్య పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న ఇద్దరు కొండవాగు గెడ్డ (రాయిమానుగెడ్డ)లో కొట్టుకుపోయి గల్లంతయ్యారు. వారిలో మహిళా ఉపాధ్యాయరాలి మృతదేహం లభ్యమైంది. హర్యానా రాష్ట్రానికి చెందిన పి.ఆర్తి(26), డిప్యూటీ వార్డెన్ మహేష్ (31) ఈఏడాది జూన్ 20న ఇక్కడ ఉపాధ్యాయులుగా చేరారు. ఆర్తి (పిజిటి) జాగ్రఫీ టీచర్‌గా, మహేష్ వార్డెన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. పాఠశాలలో వసతి సౌకర్యం లేకపోవడంతో పాచిపెంట మండలం గురువునాయుడుపేటలో నివాసం ఉంటూ రాకపోకలు సాగిస్తున్నారు. శుక్రవారం సాయంత్రం విధులు ముగించుకొని పాఠశాల నుంచి గురువునాయుడుపేటకు బైక్‌పై బయలు దేరారు. మధ్యాహ్నం కురిసిన వర్షానికి కొండవాగు ఉధృతంగా ప్రవహించడంతో కొద్దిసేపు గెడ్డవద్ద ఆగారు. అదే సమయంలో మరో వాహనం గెడ్డ దాటుకుని వెళ్లిపోవడంతో వీరు కూడా మోటార్ సైకిల్‌తో గెడ్డ దాటేందుకు ప్రయత్నించగా అకస్మాత్తుగా గెడ్డ ఉధృతం కావడంతో ఇరువురూ కొట్టుకుపోయారు. స్థానికుల సమాచారం మేరకు స్థానిక తాహశీల్దార్ డి.రవి, ఆర్ ఐ రమణ, ఎస్ఐ పి.నారాయణరావు, సిబ్బంది హుటాహుటిన ఇక్కడికి చేరుకొని గాలింపు చేపట్టారు. వారు ప్రయాణించిన బైక్ అరకిలోమీటరు దూరంలో ఇసుకలో కూరుకుపోయి కనిపించగా, అక్కడికి మరికొద్ది దూరంలో ఆర్తి మృతదేహం లభించింది. వార్డెన్ మహేష్ కోసం గాలించినప్పటికీ లభ్యం కాలేదు. రాత్రి కావడంతో గాలింపు చర్యలు నిలిపివేస్తున్నట్లు తహశీల్దార్ రవి తెలిపారు. ఆర్తి మృతదేహాన్ని సాలూరు సిహెచ్‌సికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

మండలాన్ని పర్యాటకంగా అభివృద్ధి : మంత్రి

చెరుకుపల్లి- పారమ్మకొండ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి సంధ్యారాణి

ప్రజాశక్తి - పాచిపెంట

మండలాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. సాలూరు నియోజకవర్గంలో రూ.20 కోట్లతో పర్యాటక పనులు ప్రతిపాదించామని, అందులో దాదాపు రూ.12 కోట్ల వరకు పనులు మంజూరయ్యే అవకాశం ఉందని ఆమె అన్నారు. రూ.1.60 కోట్లు నిధులతో మండలంలోని నేషనల్ హైవే నుంచి చెరుకుపల్లి మీదుగా పారమ్మ కొండ వద్దకు బిటి రోడ్డు పనులకు మంత్రి సంధ్యారాణి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు గెలిచిన నెల రోజుల్లోనే పారమ్మకొండకు రోడ్డు మంజూరు చేశామన్నారు. త్వరలో పాచిపెంట, సాలూరు గిరిజన మండలాలకు అన్న క్యాంటీన్లు మంజూరు చేస్తామని మంత్రి తెలిపారు. అన్ని గిరిజన మండల కేంద్రాల్లో అన్న క్యాంటీన్ మంజూరు చేశామని చెప్పారు. నియోజక వర్గంలో 31 గ్రామాలకు తాగు నీటి పనులు మంజూరయ్యాయని తెలిపారు. అన్ని గిరిజన గ్రామాల్లో జల్ జీవన్ మిషన్ కింద ఇంటింటికి తాగు నీరు కల్పించేందుకు చర్యలు చేపట్టామన్నారు. జల్‌జీవన్ మిషన్ అవకాశం లేని 70 గ్రామాల్లో బోరు, ట్యాంకు ఏర్పాటు చేసి నీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. రాష్ట్రంలో 2 వేల గిరిజన గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని ముఖ్యమంత్రి నిర్ణయించారని ఆమె వివరించారు. ఎన్నికల అప్పుడే రాజకీయాలని, ఆ తర్వాత అంతా కలిసి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేద్దామని ఆమె కోరారు. పారమ్మ కొండపై వెంకటేశ్వరస్వామి ఆలయం నిర్మించుకుందామన్నారు. శివరాత్రి రోజున పెద్ద ఎత్తున యాత్ర జరిగే పారమ్మ తల్లి కొండకు తారు రహదారి పనులు ప్రారంభం పట్ల పారమ్మతల్లి భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆర్‌పి భంజ్‌దేవ్, పాచిపెంట, సాలూరు పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు పిన్నింటి ప్రసాద్‌బాబు, నిమ్మాది చిట్టి, పరమేష్, ముఖీ సూర్యనారాయణ, గూడెపు యుగంధర్, పి.నరసింగరావు, చల్ల కనక, సిహెచ్ సీతారామకృష్ణ, డిఇ మణికుమార్, ఎఇ బి.సత్యనారాయణ, తహశీల్దార్ డి.రవి, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

పర్యాటక రంగ విస్తరణకు చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

జిల్లాలో పర్యాటక రంగం విస్తరించేలా కషి చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పర్యాటక అధికారి ఎన్.నారాయణరావును ఆదేశించారు. 2047 నాటికి ఎకానమికల్ మాస్టర్ ప్లానింగ్ ఫర్ డెవలపింగ్ విశాఖపట్నం సిటీ రీజియన్ గ్రోత్ హబ్ అంశంపై శుక్రవారం నీతి అయోగ్ అధికారులు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొన్నారు. జిల్లాలో ఆర్థిక అభివృద్ధికి అవకాశాలు ఉన్న రంగాలను గుర్తించాలని, తద్వారా నూతన పెట్టుబడులు, ఉద్యోగ అవకాశాలు దిశగా అన్ని చర్యలు చేపట్టాలని నీతి అయోగ్ అధికారులు సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం వివిధ శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పర్యాటక అభివృద్ధి పెద్దఎత్తున చేపట్టే అవకాశాలున్నాయని అన్నారు. అందులో ఆర్థిక అభ్యున్నతి సాధించేందుకు అవకాశాలు ఉన్నాయని ఆయన చెప్పారు. వారం రోజుల్లో జిల్లాలో గల ఉన్న అవకాశాలపై ప్రత్యేక నివేదిక తయారు చేసి సమర్పించాలని ఆదేశించారు. జిల్లాలో అందమైన ప్రకృతి వనరులున్నాయని అనేక ఔషధ విలువలు గల మూలికలు ఉన్నాయని వాటి ద్వారా స్థానికంగా వైద్య సేవలు పలుచోట్ల అందుతున్నాయని తెలిపారు. అటువంటి వాటిని పెద్ద ఎత్తున ప్రజలకు అందుబాటులో తీసుకుని రావడం, పర్యాటకులను ఆకర్షించడం ద్వారా ఈ ప్రాంతం ప్రకృతి వైద్య సూచనలకు హబ్‌గా మారగలదన్నారు. భోగాపురం ఎయిర్ పోర్టు వంటి సదుపాయాలు రావడం వల్ల జిల్లాకు సులభంగా రావచ్చని కలెక్టర్ అన్నారు. అవసరమైతే కొంతమంది ఆసక్తి గల అభ్యర్థులకు వాటిలో శిక్షణ ఇప్పించడం ద్వారా మరింత వృత్తినైపుణ్య సేవలు అందుతాయని చెప్పారు. ఆధ్యాత్మిక రంగంలో జిల్లా ప్రత్యేకత సంతరించుకుందని పేర్కొంటూ టెంపుల్ సర్క్యూట్ ఏర్పాటు ద్వారా పర్యాటకులను విశేషంగా ఆకర్షించే అవకాశాలు ఉన్నాయని అన్నారు. తోటపల్లి, పెద్దగెడ్డ వంటి రిజర్వాయర్లు ఉన్నాయని, వాటిలో వాటర్ స్పోర్ట్స్ పెట్టేందుకు అవకాశాలను పరిశీలించాలని ఆదేశించారు. అడ్వెంచర్ స్పోర్ట్స్, ట్రెక్కింగ్ వంటి అంశాలను కూడా పరిశీలించాలని ఆయన సూచించారు. పర్యాటక రంగంలో ఆయా ప్రాంతాలను అభివృద్ధి చేసి మంచి సాఫ్ట్‌వేర్ ఏర్పాటు చేసి టికెట్ ధరలు నిర్ణయించడం ద్వారా వాటి నిర్వహణ చక్కగా సాగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. పర్యాటక ప్రాంతాల్లో భోజన వసతులను స్వయం సహాయక సంఘాలకు అప్పగించేందుకు చర్యలు చేపడుతామని అన్నారు. వాటర్ స్పోర్ట్స్ నిర్వహణలో అన్ని సురక్షిత విధానాలు విధిగా అమలు చేయాలని, అందులో అనుభవజ్ఞులను తీసుకురావాలని అన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, అధికారులు

ప్రపంచ పర్యాటక దినోత్సవం ఏర్పాట్లు చేయాలి

సెప్టెంబర్ 27న ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా జిల్లాలో పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేపట్టాలని పర్యాటక అధికారికి కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. సీతంపేటలో ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్క్‌కు అదనపు సౌకర్యాలు ఏర్పాటుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. గిరిజన మ్యూజియం ప్రారంభోత్సవం, ప్రకృతి వ్యవసాయం, అడ్వెంచర్ స్పోర్ట్స్ తదితర కార్యక్రమాల ప్రారంభోత్సవానికి కూడా ఉన్న అవకాశాలను పరిశీలించాలని ఆయన ఆదేశించారు. సమావేశంలో డ్వామా పీడీ కె.రామచంద్రరావు, జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్ పాల్, జిల్లా పరిశ్రమల అధికారి ఎంవి కరుణాకర్, జిల్లా ప్రణాళిక అధికారి పి. వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

నీట మునిగిన బాలికల గురుకులం

సొంత భవనాలు నిర్మించాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

పట్టణ శివారున గల మహాత్మ జ్యోతిబాపూలే బాలికల రెసిడెన్షియల్ పాఠశాల గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి వరహాలుగెడ్డ ఉప్పొంగడంతో వరదనీరు పాఠశాలలోకి వచ్చింది. దీంతో విద్యార్థుల రాకపోకలకు అంతరాయం కలగడమే కాకుండా వరద నీరు పాఠశాలలోకి ఎక్కడ చేరుతుందోనని బిక్కుబిక్కుమంటూ విద్యార్థులు గడపాల్సిన పరిస్థితి ఏర్పడింది. నిత్యవసర వస్తువులు కూడా బయట నుంచి పాఠశాలకు తరలించడంతో విద్యార్థుల భోజనాలకు తీవ్ర అంతరాయం కలిగింది. జిల్లా వ్యాప్తంగా విద్యార్థులు చదివే ఈ పాఠశాలకు కనీస భద్రత కల్పించాలని, అధికారులు ఈ విషయం పరిశీలన చేసి విద్యార్థినిలకు ఎలాంటి అవసరం లేకుండా తగిన చర్యలు చేపట్టాలని విద్యార్థులు తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు కోరుతున్నారు.

సొంత భవనాలు నిర్మించాలి : ఎస్ఎఫ్ఐ

అద్దె భవనంలో నిర్వహిస్తున్న మహాత్మ జ్యోతిబా పూలే బాలికల రెసిడెన్షియల్ పాఠశాలకు సొంత భవనాలు నిర్మించి విద్యార్థులను అక్కడకు తరలించాలని ఎస్ఎఫ్ఐ అధ్యక్ష కార్యదర్శులు కె.రాజు, డి.పండు డిమాండ్ చేశారు. గురువారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు రెసిడెన్షియల్ పాఠశాలలో వరద నీరు చేరి బీభత్సం సృష్టించడంతో, శుక్రవారం ఎస్ఎఫ్ఐ నాయకులు హాస్టల్‌ను సందర్శించి పరిస్థితులు సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతం నుంచి ఈ సమస్య ఉందని, ఏళ్లు గడుస్తున్నా ఈ సమస్య పరిష్కారం కావడంలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పాఠశాలలో ప్రహరీ గోడ లేకపోవడంతో పాఠశాల ఆవరణ లోపలికి నీరు వస్తుందని, దీని కారణంగా విద్యార్థులకు రాత్రిపూట అనేకమైన విషపూరితమైన సర్పాలు, కీటకాలు వచ్చి విద్యార్థులపై కాటు వేస్తే బాధ్యత ఎవరు వహిస్తారని ప్రశ్నించారు. గేటు బయట నుండి తరగతి గదుల వరకు నీరు ఉండడం వల్ల ఎవరైనా లోపలికి రావాలన్నా, వెళ్లాలన్నా రాకపోకలు లేని పరిస్థితి ఉందన్నారు. పాఠశాల క్రీడా మైదానంలో విద్యార్థులు ఆటలు ఆడే అవకాశం లేని పరిస్థితి కనిపిస్తుందన్నారు. నీటి మధ్య నుండి వెళ్లేటప్పుడు పాములు విషపూరితమైన పురుగులు కాటేసే అవకాశలు ఉన్నాయన్నారు. వంటగది చుట్టూ పక్కల నీరు నిల్వ ఉన్న పరిస్థితి ఉందన్నారు. వంటలు చేయడానికి కూడా ఇబ్బంది పడుతున్నామన్నారు. ఇన్ని సమస్యలున్నందుకు సొంత భవనం ఏర్పాటు చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. అలాగే తాత్కాలికంగా స్కూల్ గేట్ దగ్గర కూల్చిన ప్రహరీ గోడను వెంటనే నిర్మించాలని డిమాండ్ చేశారు. లేకుంటే విద్యార్థులతో పెద్ద ఎత్తున భవిష్యత్తులో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు హెచ్.సింహాచలం, మండల కమిటీ సభ్యులు వి.చంటి, కె.శ్రీను, కె.రాజేష్ పి.వెంకీ పాల్గొన్నారు.

ముంపునకు గురైన గురుకులం వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన నిరసన తెలుపుతున్న విద్యార్థినులు

పట్టణంలోని ముంపు ప్రాంతాలను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

ముంపు సమస్యను పరిష్కరించాలి : సిపిఎం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలోని నెల్లిచెరువు గట్టు, వరహాలగెడ్డతో పాటు పలు బందల్లో ఉన్న ఆక్రమణలు తొలగించి పట్టణాన్ని ముంపు బారి నుంచి రక్షించాలని సిపిఎం నాయకులు రెడ్డి వేణు, గొర్లి వెంకటరమణ, బొంకురు సూరిబాబు, సంచాన ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. పట్టణంలో గురువారం రాత్రి కురిసిన భారీ వర్షం కారణంగా పలు ప్రాంతాల్లో గల కాలనీలు జలమయమవ్వడంతో శుక్రవారం ఉదయం ఆయా ప్రాంతాల్లో వారు పర్యటించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో ఉన్న డిఇ పి.కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో శివారు కాలనీల్లో లేఅవుట్లు వేసినా సంబంధిత యజమానులు కాలువలను సక్రమంగా నిర్మించలేదని, ఆ కాలువల్లో పూడికలు పేరుకు పోయాయని అన్నారు. దీనివల్ల వర్షం, వాడుకు నీరు పోయేందుకు అవకాశం లేకుండా పోయి రోడ్లపైనే నీరు ప్రవహిస్తుందని తెలిపారు. పూడికలు తొలగించాలని, గెడ్డల్లో, చెరువుల్లో, బందల్లో ఎక్కడికక్కడ ఆక్రమణలు జరుగుతున్నాయని అన్నారు. ఈ ఆక్రమణలను తొలగించాలని, వరహాల గెడ్డ ప్రవహించు ప్రాంతమైన వీరభద్ర థియేటర్ వద్ద కర్షక మహర్షి మహర్షి ఆసుపత్రి ఏరియాలో ఉన్న గెడ్డలో కల్వర్టు నిర్మించేందుకు ఫిల్లర్లు నిర్మించారని దీని కారణంగా వర్షపు నీరు ప్రవహించడం లేదని, గెడ్డలో పూడికలు పేరుకుపోయి వర్షపు నీరు, మురుగు నీరు వెళ్లేందుకు అవకాశం లేకుండా మట్టి దిబ్బలు పేరుకుపోయాయని తెలిపారు. ఈ పూడికలను పూర్తి స్థాయిలో తొలగించాలని, అన్నారు.

భూముల లెక్క తేలాల్సిందే

రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పి సిసోడియా

ప్రజాశక్తి-విజయనగరం కోట

పేదలందరికీ ఇళ్ల పథకం కింద కేటాయించిన భూముల వివరాలను నిర్దేశిత ప్రోఫార్మాలో సమర్పించాలని రెవిన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి.సిసోడియా తహశీల్దార్లకు ఆదేశించారు. ఈ పథకం కింద మొత్తం ఎంత భూమి కేటాయించారు, అందులో ఎంత ప్రభుత్వ భూమి, ఎంత డి-పట్టా భూమి, ఎంత భూమిని కొనుగోలు చేసారు, ఎంత డబ్బు పరిహారంగా చెల్లించారు, ఇళ్ళ కోసం కేటాయించగా ఎంత భూమి మిగిలింది, లబ్ధిదారుల అర్హత వివరాలతో సహా నిర్దేశిత ప్రోఫార్మాలో రెవెన్యూ సదస్సుల లోపల సమర్పించాలని సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఆర్‌పి సిసోడియా రెవెన్యూ అధికారులతో సమీక్షించారు. గత 5ఏళ్లలో 22ఎ కింద నోటిపై చేసిన భూముల వివరాలను, వెబ్‌ల్యాండ్, మ్యుటేషన్ సేవల రిపోర్ట్ లను మండలాల వారీగా పరిశీలించారు. రీ సర్వే అంశాలపై తహశీల్దార్లతో చర్చించారు. 20 ఏళ్ల క్రితం వరకు ఫ్రీ హోల్డ్ లో ఉన్న భూములను వెరిఫికేషన్ చేయవలసి ఉంటుందని అన్నారు. జిల్లాలో అసైన్డ్ భూముల వివరాలను, రైతుల కోసం, ఇళ్ల కోసం కేటాయించిన వాటి వివరాలను వేర్వేరుగా తహశీల్దార్లు నివేదికలు ఇవ్వాలని తెలిపారు. సబ్ రిజిస్ట్రార్ రికార్డులలో ఉన్న వివరాలు తహశీల్దార్ రికార్డులలో ఉన్న వివరాలు ఒకటే ఉండాలని అన్నారు.

జిల్లాలోని అన్ని రెవెన్యూ కార్యాలయాల్లో రికార్డులకు పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అగ్నిప్రమాదాల నుంచి రక్షణ కల్పించే విధంగా పటిష్టమైన భద్రత వ్యవస్థను ఏర్పరిచేందుకు తహశీల్దార్ కార్యాలయాల్లో సిసి టివి కెమెరాలను ఏర్పాటు చేయాలని, రాత్రి వేళల్లో కార్యాలయాల వద్ద వాచ్ మెన్‌లను నియమించా లని తెలిపారు.. రెవెన్యూ కార్యాలయాల్లో షార్ట్ సర్క్యూట్ వల్ల అగ్ని ప్రమాదాలు జరగకుండా భద్రత చర్యలు తీసుకోవాలని తెలిపారు. సమావేశంలో కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్, జెసి సేతు మాధవన్, డిఆర్ఒ అనిత, ఆర్‌డిఒలు సూర్య కళ, శాంతి, సాయిశ్రీ, జిల్లా రిజిస్ట్రార్ ఎవి కుమారి, తహశీల్దార్లు పాల్గొన్నారు.

పలు మండలాల్లో పర్యటన

ఆర్.పి.సిసోడియా భోగాపురం, ఎస్.కోట, వేపాడ మండలాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించారు. భూరికార్డులను పరిశీలించి భూముల వర్గీకరణపై వివిధ ప్రభుత్వ శాఖల వద్ద రికార్డుల్లో తేడాలు వుండటాన్ని గుర్తించారు. భోగాపురం మండలం పోలిపల్లి నిర్వాసితుల పునరావాస కాలనీని పరిశీలించారు. మండలపరిషత్ ప్రాథమిక పాఠశాలకు చేరుకొని గ్రామ రెవెన్యూ రికార్డులను పరిశీలించారు. పలువురు రైతులతో మాట్లాడి భూముల క్రయవిక్రయాలపై సమాచారం సేకరించారు. అనంతరం భోగాపురంలో తహశీల్దార్ కార్యాలయం, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను సందర్శించి భూములకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. బసవపాలెం గ్రామస్థులతో మాట్లాడి భూసర్వే జరిగిన తీరుపై ఆరా తీశారు.

వైటిసిని పరిశీలిస్తున్న ఇన్‌ఛార్జి పిఒ

సంక్షేమ పథకాల చేరువకు కృషి : పిఒ

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఐటిడిఎ ఇన్‌ఛార్జి పిఒగా పాలకొండ ఆర్‌డిఒ వి.వెంకటరమణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఐటిడిఎ ద్వారా గిరిజనుల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అనంతరం స్థానిక వైటిసిని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వైటిసిలో గర్భిణుల వసతి గృహం ఏర్పాటుకు అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. గర్భిణులకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పించాలన్నారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అలాగే ఉచిత డీఎస్సి కోచింగ్‌కు ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు చేయాలని అన్నారు. అభ్యర్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఎపిఒ చినబాబు, డిప్యూటీ డిఇఒ నారాయుడు, వైటిసి మేనేజర్ వెంకటరమణ, ఎఎంఒ కోటిబాబు, సిఎంఒ చిరంజీవులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పార్వతీపురం ఎస్‌డిపిఒగా అంకిత

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

పార్వతీపురం సబ్ డివిజనల్ పోలీస్ అధికారిగా అంకిత్ సురాన్ మహవీర్ నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు విడుదలయ్యాయి. ఇప్పటివరకు పార్వతీపురం ఎస్‌డిఎస్‌పిఒగా పనిచేస్తున్న సునీల్ షరోన్‌ను గ్రేహౌండ్స్ కు బదిలీ చేసినట్లు సమాచారం

సాగునీటి సరఫరాలో విఫలం : సిపిఎం

ప్రజాశక్తి - వీరఘట్టం

శివారు ప్రాంతాల భూములకు సాగునీరందించడంలో ఇటు పాలకులు అటు అధికారులు పూర్తిగా విఫలమయ్యారని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.తిరుపతిరావు విమర్శించారు. మండలంలోని నడుకూరు, కొట్టుగుమ్మడ, గడగమ్మ గ్రామాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తోటపల్లి రిజర్వాయర్ ద్వారా ప్రతి ఎకరాకు సాగునీరందిస్తామని పాలకులు, నీటిపారుదల శాఖ అధికారులు సాగునీరు విడిచి పెట్టినప్పుడు ఉపన్యాసాలకే పరిమితమవుతున్నారు తప్ప సాగునీరందించడంలో విఫలమయ్యారని విమర్శించారు. తోటపల్లి ప్రధాన ఎడమ కాలువ ద్వారా గత నెల 13న సాగునీరు విడుదల చేశారని, నేటికీ గడగమ్మ, కొట్టుగుమ్మడ, నడుకూరు గ్రామాలకు సాగునీరు రాకపోవడంతో అన్నదాతలు వర్షాలపైనే ఆధారపడి పంటలు సాగు చేస్తున్నారని అన్నారు. ఇప్పటికే కొంతమంది ఎదజల్లగా, మరి కొంతమంది మొక్కజొన్న పంట వేసుకున్నారని, వరి నారు చల్లిన రైతులు సాగునీటి కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. దీర్ఘకాలంగా ఈగ్రామాల రైతులు సాగునీటి కోసం వేయికళ్లతో ఎదురు చూస్తున్నారు. ఈ సమయంలో పచ్చగా కళకళలాడాల్సిన పంట పొలాలు బీడు భూములుగా దర్శనమిస్తున్నాయని ఆయన అన్నారు. పరిశీలనలో సిపిఎం మండల నాయకులు ఎన్.సింహాచలం ఉన్నారు.

షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభిస్తున్న డిప్యూటీ డిఇఒ రాజ్‌కుమార్

బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - సాలూరు

యుటిఎఫ్ స్వర్ణోత్సవాల సందర్భంగా శుక్రవారం పట్టణంలో నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీల్లో భాగంగా షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను డిప్యూటీ డిఇఒ రాజ్‌కుమార్, ఎంఇఒ -2 పి.దాస్ ప్రారంభించారు. పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో యుటిఎఫ్ ఆధ్వర్యాన షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభించారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు తోట రమేష్, స్థానిక నాయకులు ఎ.గణేష్, మన్మధ రావు, జానకీరావు, సీతయ్య, ఎస్.సింహాచలం, జగదీష్, రాజమణి, రమేష్ పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలోని మూడు నెలలకు ఒకసారి అభివృద్ధి సమస్యలపై జరిగే మండల సర్వసభ్య సమావేశం శనివారం జరుగుతుందని ఎంపిడిఒ మల్లికార్జునరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన విలేకరులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఎంపిపి శెట్టి శ్యామల అధ్యక్షతన జరుగు సమావేశానికి సంబంధిత అన్ని విభాగాల మండల స్థాయి అధికారులు పూర్తిస్థాయి నివేదికలతో హాజరుకావాలని ఆదేశించారు.

వీధి దీపాలు వెలగకపోవడంతో అంధకారంలో పార్వతీపురం పట్టణం

వెలగని సెంటర్ డివైడర్ లైట్లు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలోని ప్రధాన రహదారి మధ్యలో డివైడర్ పై ఉన్న విద్యుత్ లైట్లు గత కొన్ని రోజులుగా వెలగకపోవడంతో మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు కానీ, మున్సిపల్ పాలకవర్గ కౌన్సిలర్లు గానీ కనీసం పట్టించుకోవడం పట్ల స్థానిక ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు. వీటితో పాటు పట్టణంలో పలు వీధుల్లోని వీధిదీపాలు మరమ్మతులకు గురై వెలగక పోయినా పట్టించుకునే నాథుడు కరువయ్యారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటికీ వైసిపి అధికారం పాలకవర్గ కౌన్సిల్ సభ్యులు పట్టణంలో ఉన్న సమస్యలను పట్టించుకోవడంలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా కౌన్సిలర్లు, ఇంజనీరింగ్ అధికారులు దృష్టిపెట్టి వీధిదీపాల పునరుద్ధరణకు ఏర్పాట్లు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

బొత్సకు అభినందనలు తెలుపుతున్న మాజీఎమ్మెల్యే జయమణి, రామారావు

బొత్సకు జయమణి శుభాకాంక్షలు

ప్రజాశక్తి - సీతానగరం

విశాఖ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక ఏకగ్రీవంగా ఎన్నికైన మాజీ మంత్రి బొత్స సత్యనారాయణకు మాజీ ఎమ్మెల్యే సవరపు జయమణి, వైసిపి నాయకులు సవరపు రామారావు, సిడిసి మాజీ చైర్మన్ నడిమింటి రామకృష్ణ, మాజీ ఎంపిటిసి ఎస్.మాధవరావు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన స్వగృహంలో కలుసుకొని అభినందనలు తెలిపారు. ఎన్నిక ఏకగ్రీవం కావడంతో వైసిపికి నూతన ఉత్తేజం వచ్చిందని, ప్రజా సమస్యలపై మాట్లాడేందుకు సరైన నాయకులు వచ్చారని వారు అన్నారు.

అంగన్వాడీలకు ఎల్ఇడి టివిలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

భద్రగిరి ఐసిడిఎస్ పరిధిలో గల అంగన్వాడీ కేంద్రాలకు ప్రభుత్వం ఎల్ఇడి టీవీలు, ఆర్వో మినరల్ ప్యూరిఫై వాటర్ సామాగ్రి పంపిణీ చేసింది. ఇందులో భాగంగా బాలేసు, దొరజమ్ము, డుమ్మంగి, ఎల్విన్‌పేట, గుమ్మలక్ష్మీపురం, కన్నయ్యగూడ, కారివలస, మండ, రుణిని కాలనీ, ఎస్ కె పాడు, ఎగువ తాడికొండ అంగన్వాడీ కేంద్రాలకు ఎతిడి టీవీలు, వీటితో పాటు చిన్నారులు ఆడుకునేందుకు ఆట వస్తువులు పంపిణీ చేశారు. గుమ్మలక్ష్మీపురం అంగన్వాడీ కేంద్రానికి సర్పంచి బొత్తాడ గౌరీ శంకర్రావు చేతుల మీదగా ఆరో ప్లాంట్ అందజేశారు. కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ సుధారాణి ఉన్నారు.

గుమ్మలక్షీపురం అంగన్‌వాడీ కేంద్రంలో ఆర్ఒ ప్లాంట్ ప్రారంభిస్తున్న సర్పంచ్

మూతపడిన సర్కారు బడులు

- విద్యార్థులకు తప్పని అవస్థలు
- 1 నుంచి 5 తరగతి వరకు ఒక్కరే ఉపాధ్యాయుడు

ప్రజాశక్తి - వీరఘట్టం

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి విద్యాశాఖ కృషి చేయాలని ప్రభుత్వం ఆర్భాటంగా ప్రచారం చేస్తున్నప్పటికీ జిఒ 117 పుణ్యమా అని నేడు సర్కారు బడులు ఒక్కొక్కటి మూతపడుతున్నాయి. దీంతో విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు. మండలంలోని పెద్దగదబవలస, శృంగారాయపురం, సిఎస్ఆర్ పేట, వంకాయలగెడ్డ, సింధునగర్, ఎస్.గోపాలపురం, గాదిలంక, వీరఘట్టంలోని సిబిఎం, ఆర్‌సిఎం ఎయిడెడ్, కంబరలోని సిబిఎం ఎయిడెడ్ పాఠశాలలు మూతపడ్డాయి. సింధునగర్ విద్యార్థులు పెద్దూరు, వంకాయలగెడ్డ విద్యార్థులు ఎం.రాజపురం, సిఎస్ఆర్‌పేట విద్యార్థులు చిదిమి, శృంగారాయపురం విద్యార్థులు బొడ్డపాడు, గదబవలస విద్యార్థులు కత్తులకవిటి, వీరఘట్టంలోని సిబిఎం పాఠశాల విద్యార్థులు అక్కడే ఉన్న రెగ్యులర్, కూరాకుల వీధి పాఠశాలల్లో, ఆర్‌సిఎం పాఠశాల విద్యార్థులు బీసీ కాలనీ పాఠశాలలో, కంబర సిబిఎం పాఠశాల విద్యార్థులు అక్కడే ప్రాథమిక పాఠశాలలో, గాదిలంక విద్యార్థులు మూలలంక పాఠశాలకు వెళ్లి విద్యను కొనసాగిస్తున్నారు. విద్యార్థులు స్వగ్రామానికి వీరు చదువుతున్న పాఠశాలకు కిలోమీటర్ల దూరం ఉండడంతో ఇటు విద్యార్థులకు అటు తల్లిదండ్రులకు అవస్థలు తప్పడం లేదు. దీనికి తోడు రహదారులు అధ్వానంగా ఉండడం వల్ల ప్రస్తుత అప్పుడప్పుడు కురుస్తున్న వర్షాల కారణంగా చిందరవందరంగా తయారవ్వడంతో రాకపోకలు సాగించేందుకు మరిన్ని అవస్థలు గురికావాల్సి వస్తుందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అన్నింటికీ ఒక్కరే

పెద్దూరు, సంధిమానుగూడ, అచ్చెప్పవలస, పాపంపేట, జె.గోపాలపురం, ఆడారు, మహాదేవివలస గ్రామాల్లో పాఠశాలల్లో ఒకటి నుంచి 5వ తరగతికి ఒకే ఒక ఉపాధ్యాయుడు పాఠాలు చెబుతున్నారు. ఆ ఉపాధ్యాయుడు అత్యవసర పరిస్థితుల్లో ఎటు వెళ్లాలన్నా ముందుగా మండల విద్యాశాఖ కార్యాలయానికి సమాచారం ఇవ్వాల్సి ఉంది. వండువ, సంత నర్సిపురం, నీలానగరం, తలవరం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు కిలోమీటర్ పరిధిలో ఉన్నందున విలీనం చేయడంతో 3,4,5 తరగతుల విద్యార్థులు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లిపోవడంతో ఆ ఉపాధ్యాయ పోస్టులు కుదింపుతో పాటు విద్యార్థుల సంఖ్య తగ్గడంతో ఈ పాఠశాలలో కూడా ఏకైక ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు.

విద్యార్థులకు తప్పని అవస్థలు

మండలంలోని యు.వెంకంపేటలో 23మంది, చిట్టిపూడి వలసలో 31 మంది విద్యార్థులకు ఒకే ఒక్క భవనం ఉంది. అలాగే వీరఘట్టంలోని బీసీ కాలనీ పాఠశాలలో 120 మంది విద్యార్థులకు రెండే రెండు తరగతి గదులు ఉండడంతో ఇరుకైనా గదుల్లో విద్యను కొనసాగిస్తూ విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. యు.వెంకంపేట పాఠశాలకు అదనపు భవనం లేకపోవడంతో ఉన్న గదిలో వంట చేసి విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని అందిస్తున్నారు. చిట్టిపూడివలసలో విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని గ్రామస్తులు కొంత మొత్తాన్ని పోగుచేసి అదనపు రేకుల షెడ్డును నిర్మించారు. బీసీ కాలనీలో రెండే రెండు తరగతి గదులున్నప్పటికీ ఇరుకైన గదిలోనే విద్యార్థులు విద్యను కొనసాగించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఇదే ఆవరణంలో 2014లో రాజీవ్ విద్యామిషన్ ఆధ్వర్యంలో రూ.7.5 లక్షలతో అదనపు భవనం నిర్మించారు. గుత్తేదారుల నిర్లక్ష్యం వల్ల సకాలంలో పనులు పూర్తిచేయక అదనపు భవనం పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ఇదే పాఠశాలలో మొదటి విడత కింద నాడు-నేడు పనులు జరిగినప్పటికీ వెచ్చించిన నిధుల్లో రెండు లక్షల వరకు వెచ్చించిన ఉంటే ఈ భవనం కూడా పూర్తి అయిపోయి ఉండేది. అయితే అప్పట్లో అధికారులు అంగీకరించకపోవడంతో ఇరుకైన గదిలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే ఉపాధ్యాయులు నియమించి, అదనపు తరగతి గదులు నిర్మించాలని కోరుతున్నారు.

వీరఘట్టంలో బిసి కాలనీలో అర్ధాంతరంగా నిలిచిపోయిన అదనపు తరగతి గదులు

దాతల సాయంతో చీట్టిపూడివలసలో నిర్మించిన రేకుల షెడ్

గ్రామాలకు పక్కా రహదారులు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

నియోజకవర్గంలోని మూడు మండలాలకు చెందిన అన్ని గ్రామాలకు రహదారులు మరమ్మతులతో పాటు పక్కా రోడ్ల నిర్మిస్తామని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. మండలంలోని వెలగవలస రోడ్డు నుంచి డోకిశిల, ఎన్ ములగ మీదుగా రూ.285 లక్షల అంచనాతో నిర్మించబోయే బీటీ రోడ్డుకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం రహదారుల మరమ్మతుల నిర్వహణను గాలికి వదిలి వేయడంతో రోడ్లన్నీ గుంతలుగా మారిపోయాయని, దీనివల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అన్నారు. పనులు మంజూరు చేసినప్పటికీ గత ప్రభుత్వ నిర్వాకం వల్ల కాంట్రాక్టర్లు కూడా ముందుకు రాని పరిస్థితి ఏర్పడిందని, ఈ పరిస్థితులన్నింటిని చక్కదిద్ది రాబోయే ఐదేళ్లలో మండలంలోని అన్ని గ్రామాలకు పక్కా రహదారుల నిర్మాణాన్ని చేపడుతామని అన్నారు. ఉపాధి హామీ ద్వారా గ్రామాల్లో నిర్మించబోయే సిమెంట్ రోడ్లకు గాను ప్రతిపాదనలు పంపించే కార్యక్రమం జరుగుతుందని, త్వరలోనే గ్రామాల్లో అన్ని వీధులకు సిమెంటు రోడ్ల నిర్మిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రెడ్డి చిన్నంనాయుడు, మండల పార్టీ అధ్యక్ష కార్యదర్శులు గొరజాన చంద్రమౌళి, బోను చంద్రమౌళి నాయకులు జాగాన రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

బిటి రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టండి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

వరద నీరు నిల్వ లేకుండా తమ కాలనీలో శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టాలని పలు కాలనీల ప్రజలు స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్రను కోరారు. గురువారం రాత్రి పట్టణంలో కురిసిన భారీ వర్షానికి పట్టణ పరిధిలో గల సౌందర్య థియేటర్ వెనుక భాగంలో ఉన్న గణేష్ నగర్ కాలనీ, ఆర్టీసీ కాంప్లెక్స్ వెనుక ఉన్న కాలనీలు వరద నీటితో ముంపుకు గురై ఆయా కాలనీల రోడ్లపై నీరు నిల్వ ఉండిపోయింది. సమాచారం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ చంద్ర, మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాస్‌తో పాటు సంబంధిత మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించి ఆయా కాలనీవాసులను కలిసి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కాలనీవాసులు ఎమ్మెల్యేతో మాట్లాడుతూ, దశాబ్ద కాలంగా గణేష్‌నగర్‌కు ముంపు సమస్య ఉందని, దీనికి శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టాలని చెప్పడంతో ఎమ్మెల్యే స్పందించి వర్షం నీరు, వాడుక నీరు వెళ్లేందుకు కాలువల విస్తరణతో పాటు కొత్త సిసి కాలువలు నిర్మించేందుకు ఇంజనీరింగ్ అధికారులతో ప్రణాళికలు రూపొందించి, త్వరితగతిన పనులను ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.మురళి, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ఐఎఎస్ అధికారిని పిఒగా నియమించాలి

ప్రజాశక్తి - సీతంపేట

సీతంపేట ఐటిడిఎ ప్రాజెక్టు అధికారిగా ఐఎఎస్ అధికారులను నియమించాలని శుక్రవారం ఐటిడిఎ ముఖ ద్వారం వద్ద గిరిజన సంఘాలు నిరసన తెలిపాయి. గిరిజనాభివృద్ధి, సంక్షేమ కోసం స్థానిక ఐటిడిఎ పిఒలుగా గతం నుండి ఇప్పటి వరకు ఐఎఎస్ అధికారులను నియమించారన్నారు. కొన్ని అనివార్య కారణాల వల్ల ప్రభుత్వం ఐఎఎస్ అధికారులను బదిలీ చేసి గ్రూపు-1 స్థాయిలో అధికారులను పిఒలుగా నియమిస్తున్నారన్నారు. కాబట్టి ప్రభుత్వం చొరవ తీసుకొని సీతంపేట ఐటిడిఎ ప్రాజెక్టు ఐఎఎస్ అధికారిని నియమించాలని కోరారు. ఐఎఎస్ అధికారిని ఐటిడిఎ పిఒగా నియమించే వరకు గిరిజన సంఘాలు పోరాటం చేస్తూనే ఉంటాయని అన్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘాలు, గిరిజన ఐక్యవేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి చౌదరి లక్ష్మీనారాయణ, గిరిజన ప్రజాసమాఖ్య ఉత్తరాంధ్ర జిల్లాల అధ్యక్షులు సవర చిరంజీవిలు, జిల్లా అధ్యక్షులు సవర మోహన్‌పాల్, ట్రైబల్ డెవలప్మెంట్ మిషన్ జిల్లా అధ్యక్షులు మండంగి విశ్వనాథం, కార్యవర్గ సభ్యులు, గిరిజన నాయకులు పాల్గొన్నారు.

ప్రిన్సిపల్ సస్పెన్షన్ వెనుక రాజకీయ లబ్ధి

ఎస్ఎంసి ఎన్నికలపై సమగ్ర విచారణకు ఎఐఎస్ఎఫ్ డిమాండ్

ప్రజాశక్తి - మక్కువ

ప్రజా సమస్యల పరిష్కార వేదికల్లో విద్యార్థుల సమస్యలపై అధికారులకు తెలియజేసినప్పటికీ పట్టించుకునే వారే కనిపించలేదని, ములక్కాయవలస మోడల్ పాఠశాల ప్రిన్సిపల్ స్వర్ణలత విషయంలో రాజకీయ లబ్ధి కోసం శరవేగంగా సస్పెన్షన్ ఉత్తర్వులు అధికారులు జారీ చేయడం విడ్డూరంగా ఉందని ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రవికుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక మోడల్ పాఠశాలలో జరిగిన ఆందోళన అనంతరం ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ ఎన్నికలు ఇవి రాజకీయాలకు అతీతంగా జరగాల్సినవన్నారు. ఈ ఎన్నికపై ఇటీవల గిరిజన శాఖ మంత్రి సంధ్యారాణికి ప్రజా పరిష్కార వేదికలో విద్యార్థి తండ్రి ఫిర్యాదు చేశారన్నారు. ఆయన ఫిర్యాదు మేరకు శరవేగంగా అధికారులు విచారణ జరిపి, ప్రిన్సిపల్ షోకాజ్ నోటీసులు ఇవ్వకుండా సస్పెండ్ చేయడం విడ్డూరంగా ఉందని అన్నారు. పూర్తిస్థాయిలో విచారణ జరిపి తప్పు చేసి ఉంటే ఎంతటి వారిపైనైనా చర్యలు తీసుకోవడంలో ఏమాత్రం అభ్యంతరం లేదన్నారు. ఒకవేళ పూర్తిస్థాయిలో నిర్ధారణ జరగకపోతే సస్పెన్షన్‌ను ఎత్తేయాలని కోరారు. అలాగే జిల్లాలోని హాస్టల్ విద్యార్థులు సమస్యలతో సతమతవుతున్నారన్నారు. ఈ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం లేదన్నారు. కావున తక్షణమే జిల్లాలో నెలకొన్న సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల చలో కలెక్టరేట్ నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చినమేరంగి సిఐ బదిలీ

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

చినమేరంగి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న బి.మంగరాజు శుక్రవారం శ్రీకాకుళం జిల్లా సోంపేటకు బదిలీపై వెళ్లారు. విశాఖ రేంజ్ డిజిఐ ఆదేశాల మేరకు ఈనెల 3న బదిలీ ఉత్తర్వులు వచ్చినప్పటికీ 9న సిఎం చంద్రబాబు నాయుడు పర్యటన కురుపాంలో ఉన్నందున వెళ్లలేదు. అనంతరం సిఎం ప్రోగ్రాం రద్దవ్వడంతో ఆయన శుక్రవారం సోంపేట బదిలీపై వెళ్లారు, చినమేరంగికి ఇంకా సిఐగా ఎవరు వస్తారున్నది తెలియాల్సి ఉంది.

నేడు వికసిత్ ఆంధ్రాపై శిక్షణ

ప్రజాశక్తి - పార్వతీపురం

వికసిత్ ఆంధ్రా కార్యక్రమంపై శిక్షణా కార్యక్రమాన్ని శనివారం నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రణాళిక అధికారి పి వీర్రాజు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పాల్గొంటారని ఆయన తెలిపారు. శనివారం ఉదయం 10 గంటలకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రారంభమవుతుందని, సంబంధిత జిల్లా అధికారులు అందరూ హాజరు కావాలని ఆయన కోరారు.

డిఎస్‌సి కోచింగ్‌కు ఎంపిక పరీక్ష వాయిదా

ప్రజాశక్తి - సీతంపేట

ఈనెల 20న డిఎస్‌సి కోచింగ్‌కు ఎంపిక పరీక్ష జరగాల్సి ఉండగా, ఈనెల 22 కు వాయిదా వేసినట్లు ఇన్‌ఛార్జి ఐటిడిఎ పిఒ వివి రమణ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక వైటిసిలో స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించనున్నామని, కావున ఉదయం 10 గంటలకు హాజరుకావాలని సూచించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - సాలూరురూరల్

మక్కువ మండలంలోని శంబర వద్ద గల వెంగళరాయ సాగర్ డ్యాంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభించింది. మృతుడి వయసు సుమారు 30 నుంచి 40 ఏళ్ల మధ్య ఉంటుందని, నీలరంగు జీన్స్ ప్యాంటు, కుంకుమ రంగు షర్టు ధరించి ఉన్నారు. ఎవరైనా వ్యక్తిని గుర్తుపట్టినచో సాలూరు రూరల్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్సై ఎం.వెంకటరమణ తెలిపారు. 9121109472 ఫోన్ నెంబరును సంప్రదించాలని సూచించారు.

లభ్యమైన వ్యక్తి మృతదేహం

అమ్మవారికి మఖరతోణం అందజేస్తున్న దాతలు

కోటదుర్గమ్మకు వెండి ఆభరణం బహూకరణ

ప్రజాశక్తి - పాలకొండ

పాలకొండలో వెలిసిన శ్రీకోటదుర్గమ్మ వారి దేవాలయానికి శుక్రవారం పట్టణానికి చెందిన హీరో బైక్స్ షోరూమ్ యజమాని పొట్నూరు మల్లీశ్వరరావు, బంగారం వ్యాపారస్తులు పొట్నూరు విశేశ్వరరావు, కిరాణా వ్యాపారస్తులు కందుల ఆనంద్, పి.సీతారాం కలిసి రూ.2,60,000 విలువ గల వెండి మఖరతోరణం అందజేశారు. ఈ తోరణాలన్ని ఇఒ మురళీకృష్ణకు, ఆలయ ప్రధాన అర్చకులు దారలపూడి లక్ష్మీ ప్రసాద్‌కు అందించారు.

చలో కలెక్టరేట్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

భూ సమస్యలను పరిష్కరించాలని

19న చలో కలెక్టరేట్

ప్రజాశక్తి - కొమరాడ

జిల్లాలోని పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 19న తలపెట్టిన చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి పిలుపునిచ్చారు. ఈ మేరకు మండలంలోని జల గ్రామంలో శుక్రవారం పోస్టర్‌ను విడుదల చేశారు. గిరిజన ప్రజలు ఎంత సాగు చేస్తే అంత భూమికి పట్టాలు ఇవ్వాలి, అన్యాక్రాంతమైన భూములు పేదలకు తిరిగి ఇవ్వాలని, శివ్వాం దళితుల భూములు వెంటనే వారికి అప్పజెప్పాలని, బడి దేవరకొండ గ్రానైట్ లైసెన్స్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు ఈశ్వరరావు, రెడ్డి శివున్నాయుడు, ప్రసాదు, బాబురావు, దాల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై తప్పుడు ప్రచారం మానుకోవాలి

ప్రజాశక్తి - కొమరాడ

కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరిపై కొంతమంది తప్పుడు ప్రచారం చేయడం మానుకోవాలని మండల బిసి నాయకులు హితవు పలికారు. శుక్రవారం మండల టిడిపి కన్వీనర్ ఉదయ శేఖరపాత్రుడు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే బిసిల ద్రోహి అన్నవారే నిజమైన ద్రోహులని అన్నారు. నియోజకవర్గంలో ఇప్పటికే బిసిల కోసం అనేక కార్యక్రమాలు ఎమ్మెల్యే చేసినట్లు వివరించారు. నియోజవర్గంలో ముఖ్యంగా రైతులకు నష్టపర్చే ఏనుగుల గుంపును తరలింపు విషయంలో ఎమ్మెల్యే తీసుకున్న చొరవ ప్రతి ఒక్కరికీ తెలిసిందేనని అన్నారు. ఈ ప్రాంతం నుంచి ఏనుగులు తరలిపోతే ఎక్కువగా లబ్ధి పొందేది బిసిలేనన్న విషయం ప్రతి బిసి నాయకుడు గుర్తించాలన్నారు. పూర్ణపాడు- లాబేసు వంతెన నిర్మాణానికి అహర్నిశలు కష్టపడుతున్న ఎమ్మెల్యేపై విమర్శలు మానుకోవాలన్నారు. నియోజవర్గంలో దీర్ఘకాలంగా ఉన్న సమస్యలను పరిష్కరించే దిశగా ఎమ్మెల్యే కృషి చేస్తున్నారని, అలాంటి ఆమెపై తప్పుడు ప్రచారాలు ప్రకటనలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో మండలంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

కాగితాడలో ప్రత్యేక వైద్య శిబిరం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని కాగితాడలో శుక్రవారం వీరఘట్టం పిహెచ్‌సి ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పిహెచ్‌సి వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి జ్వర పీడతలతో పాటు వివిధ రకాలైన రోగులకు ప్రత్యేక వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని చిట్టిపూడివలసలో శుక్రవారం స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా ఉత్తమ ఉపాధ్యాయులు జివిఎస్ నాయుడు, సాకేటి రాంబాబులకు సర్పంచ్ కె.పాపమ్మ, ఎంపిటిసి జి.విశాలాక్షి దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు జి.చంద్రశేఖర్, కె.లక్ష్మణ్, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న సర్పంచ్, గ్రామపెద్దలు

తాటిపళ్లతో ద్రవ జీవామృతం తయారీ

ప్రజాశక్తి - పాచిపెంట

బెల్లానికి బదులు ఎలాంటి ఖర్చులు లేకుండా బాగా ముగ్గిన తాటిపళ్లను వాడి ద్రవ జీవామృతాన్ని అతి తక్కువ ఖర్చుతో తయారు చేసుకోవచ్చని మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు అన్నారు. మండలంలోని కూనంబందవలసలో అధికార్ల కృష్ణ తన రెండు ఎకరాల వరి పొలానికి కావాల్సిన 400 లీటర్ల ద్రవ జీవామృతాన్ని తాటి పళ్ల ఉపయోగించి తయారు చేశారు. ఎకరాకు 200 లీటర్ల ద్రవ జీవామృతం తయారీకి రెండు కిలోల బెల్లానికి బదులుగా బాగా ముగ్గిన 15తాటి పండ్లు గుజ్జును బాగా పిసికి ఆ రసాన్ని 200 లీటర్ల నీటిలో కలిపి రెండు కిలోల అపరాల పిండి, 10 లీటర్ల ఆవు మూత్రం, 10 కిలోల పేడ కలిపి పిడికెడు పుట్ట మట్టిని అందులో వేసి వారం రోజులు పాటు ఉదయం, సాయంత్రం సవ్య దిశలో కలుపుతూ ఉండాలని సూచించారు. అనంతరం దాన్ని ఎకరా పొలానికి వేసుకోవాలన్నారు. ఆరోగ్యవంతమైన పంట పండాలి అంటే పంట కాలంలో ఇలా నాలుగు లేదా ఐదు సార్లు ద్రవజీవామృతాన్ని వేసుకోవాలని సూచించారు. పంట కాలంలో రసాయన ఎరువులకు అయ్యే ఖర్చు రూ.3500 కాగా, ఈ ద్రవ జీవామృతానికి అయ్యే ఖర్చు కేవలం రూ.60లేనన్నారు. అంతేకాక భూమిలో వానపాములు యాక్టినోమైసిట్స్,ఇతర బ్యాక్టీరియా వృద్ధికి ఉపయోగపడు తుందన్నారు. కావున రైతులు రసాయన ఎరువులు, పురుగు మందులకు బదులుగా ప్రత్యామ్నాయ ఖర్చు తక్కువైన ప్రకృతి సేద్య పద్ధతుల వైపు మల్లాలని వ్యవసాయ అధికారి తెలిపారు. కార్యక్రమంలో ప్రకృతి సేద్య సిఆర్‌పి విజయ్ పాల్గొన్నారు

ఉపాధ్యాయులను సన్మానిస్తున్న సర్పంచ్, గ్రామపెద్దలు